జాతీయ తెలుగు దినపత్రిక



# ప్రజా జ్యోతి

ప్రతి అక్షరం- ప్రజల కోసం

నిజామాబాద్

ఆదివారం, సెప్టెంబరు 29, 2024 3 పేజీలు


### బోధన్ రూరల్ సీఐను సన్మానించిన

## కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు నితిన్



**బోధన్ ప్రతినిధి, సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి):** బోధన్ రూరల్ ఠాణా సీఐ గా పదవి బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్‌ను శనివారం కాంగ్రెస్ ఓబీసీ సెల్ రెంజల్ మండల అధ్యక్షులు నితిన్ పుష్ప గుచ్చం ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఇక్కడే విధులు నిర్వహించిన కొల నరేష్ హైడ్రా కు బదిలీ కాగ ఆయన స్థానంలో నిజామాబాద్ పట్టణంలో విధులు నిర్వహించిన విజయ్ కుమార్ బోధన్ రూరల్ నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సం దర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కుర్మా సాయిలు, కంఠం గంగాధర్, పెద్ద సాయిలు పాల్గొన్నారు.

### సకాలంలో అభివృద్ధి ..

### 'దిశా' సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్

# పనులు పూర్తిచేయాలి



**ప్రజా జ్యోతి, నిజామాబాద్ బ్యూరో :** ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించేందుకు అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై ఎజెండా అంశాల వారీగా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ఎనలేని తాత్సారం జరుగుతోందని అన్నారు. మాక్లూర్ మండలం అడవిమామిడిపల్లి వద్ద రోడ్డు నిర్మాణంతో పాటు ఆయా చోట్ల రహదారుల నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. ఈ పెండింగ్ పనుల విషయమై చర్చించేందుకు అక్టోబర్ రెండవ వారంలో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమావేశానికి హాజరయ్యేలా చూడాలన్నారు. సకాలంలో పనులు పూర్తయి ప్రజలకు -2లో....

### ఎమ్మెల్సీ కవిత..

## కనిపించడం లేదు

### 1వ పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫిర్యాదు



**ప్రజాజ్యోతి, నిజామాబాద్ బ్యూరో :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కనిపించడం లేదని జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు ఆదె ప్రవీణ్, కోనేరు సాయికుమార్, ఈర్ల శేఖర్ తదితరులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసి నిజామాబాద్ వన్ టౌన్ ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిక్కర్ కేసులో జైలుకు వెళ్లక ముందు నుంచి కవిత నిజామాబాద్ ప్రజలకు కనిపించకుండాపోయారని, బెయిల్ పై బయటికి వచ్చిన తరువాత కూడా ఆమె ప్రజల్లోకి రాలేదన్నారు. ప్రజలు చెల్లించే పన్నుతో వేతనం, తీసుకుంటున్న ఎమ్మెల్సీ ప్రజలకు కనిపించకుండాపోవడంతో అలవెన్సులు తాము పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఆమె ఆచూకీ కొనుగోని ప్రజలకు తెలియజేయాలని పోలీసులను కోరినట్లు వారు తెలిపారు.

### హైడ్రా పై వదంతులను

## నమ్మొద్దు



**బోధన్ రూరల్, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 28 :** బోధన్‌లో హైడ్రా పై వస్తున్న వదంతులను పట్టణ ప్రజలు నమ్మవద్దని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం పట్టణంలోని పురపాలక సంఘం సమావేశం హాలులో చైర్ పర్సన్ అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధన్ పట్టణంలో హైడ్రా తరహా కూల్చివేతలపై వస్తున్న వదంతులలో వాస్తవం లేదని,ఎలాంటి సర్వేలు జరపట్లేదని స్పష్టం చేశారు.ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ప్రజలు అనవసరంగా భయభ్రాంతులకు గురి కావద్దని అన్నారు.

### ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో ..

# కలెక్టర్ రాజీవ్ గాంధీ రాత్రి బస



**ప్రజాజ్యోతి, నిజామాబాద్ బ్యూరో :** నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం పోచంపాడ్‌లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం రాత్రి బస చేశారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల స్టడీ అవర్స్ కొనసాగుతుండడాన్ని గమనించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, విద్యా బోధన, రోజువారీ దినచర్య, మెనూ తదితర వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ కె.సురేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టడీ అవర్స్ కొనసాగుతున్న గదులను సందర్శించి విద్యార్థులతో కలెక్టర్ భేటీ అయ్యారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పరంగా వారికి అందించిన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు పరిశీలించారు. అన్ని తరగతి గదులను, డార్మెటరీ, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని సందర్శించి అందుబాటులో ఉన్న వసతి సదుపాయాలు పరిశీలన జరిపారు. స్టోర్ రూమ్ లో నిలువ ఉంచిన సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి పాఠశాలలోనే కలెక్టర్ నిద్రించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ ఉన్నారు.

# సకాలంలో అభివృద్ధి .. పనులు పూర్తిచేయాలి

1వ పేజీ తరువాయి

వసతులు అందుబాటులోకి వచ్చేలా అధికారులు చొరవ చూపాలని హితవు పలికారు. వివిధ పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఆయా పనులు ఏ దశల్లో కొనసాగుతున్నాయి, వెచ్చించిన నిధుల వివరాలను తెలుపుతూ సమగ్ర నివేదికలు తనకు సమర్పించాలని ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు, ఫారెస్ట్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి కేంద్రం ద్వారా మంజూరైన నిధుల గురించి ఎం.పీ ప్రశ్నించగా, పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 40 పాఠశాలలకు కేంద్రం ద్వారా రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటిని అదనపు తరగతి గదుల నిర్మాణాలు, లైబ్రరీలు, ప్రయోగశాలలు, క్రీడా పరికరాలు, మైదానాల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నామని డీఈఓ దుర్గాప్రసాద్ తెలిపారు. అదేవిధంగా అమృత్ పథకం కింద జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలకు రూ. 335 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రజారోగ్య శాఖ ఈ.ఈ తిరుపతికుమార్ ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ నిధులతో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగుపరుస్తున్నామని, భూగర్భ డ్రైనేజీ పెండింగ్



పనుల పూర్తికి కూడా అమృత్ పథకం నిధులను వెచ్చిస్తున్నామని అన్నారు. అటవీ శాఖకు 'కాంపా' పథకం ద్వారా మంజూరైన నిధులను సక్రమంగా వెచ్చిస్తూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎం.పీ అర్వింద్ ఫారెస్ట్ అధికారులకు సూచించారు. పీ.ఎం విశ్వకర్మ పథకం అమలు తీరు గురించి ఎం.పీ ఆరా తీయగా, జిల్లాలో 23583 మంది దరఖాస్తులు చేసుకున్నారని, నల్గొండ తరువాత నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్ తెలిపారు. ఇప్పటివరకు 2592 మందికి శిక్షణ కూడా పూర్తి చేశామని వివరించారు. కాగా, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రొటోకాల్ పాటించడం లేదని ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి సమావేశంలో ఆక్షేపణ తెలిపారు. దీనిపై ఎం.పీ స్పందిస్తూ, ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగకుండా అధికారులు సంబంధిత ఎం.పీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు తప్పనిసరి ముందస్తుగానే తగిన సమాచారం అందించాలని అన్నారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

**ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్‌కు సన్మానం**

కాగా రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ హన్మంత్ రావు పదవీ విరమణ చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని దిశా సమావేశం ముగిసిన అనంతరం ఎం.పీ అర్వింద్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. సుమారు 38 సంవత్సరాల పాటు హన్మంత్ రావు అందించిన సేవలను కొనియాడారు. సుదీర్ఘ కాలంపాటు విధులు నిర్వర్తించిన సందర్భంగా ఎదురైన అనుభవాలను హన్మంత్ రావు ఈ వేదికగా పంచుకున్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కుల, మత, సమానత్వానికై పోరాడుదాం

**సి.పి.ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నేత వి.ప్రభాకర్ పిలుపు**

**బోధన్ రూరల్, ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 28 :** ప్రజలను విభజించి పాలించుటకు కుల వ్యవస్థను దోపిడీ వర్గాలు వినియోగిం చుకుంటున్నాయని నేటి పాలకవర్గాలు కుల, మతతత్వాన్ని పెంచి పోషిస్తున్నాయని దానికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యమై పోరాడాలని సి.పి.ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ మండలం ఊట్ పల్లి గ్రామంలో సి.పి.ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ మండల కమిటీ ఆధ్వర్యంలో కుల,మత సమానత్వం కై పోరాడుదాం అంటూ నిర్వహించిన సదస్సులో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారతదేశంలో కుల వ్యవస్థ ఏర్పడి కొనసాగుతుందని దేశంలోని ప్రజలు వర్గం,జాతి, మతంతో పాటు సాంఘికంగా కులాల ప్రాతిపదికపై కూడా విభజించబడి ఉన్నారని సమకాలీన భారత సమాజంలో వర్గ విభజనతో పాటు కులాలుగా విభజించబడి కుల వ్యవస్థ కొనసాగుట భారతదేశము ప్రత్యేక లక్షణాలలో ముఖ్యమైందని తెలిపారు. సమాజం ప్రారంభంలో వర్గాలు, పాలకులు,పాలితులు,శ్రమ చేసేవారు,శ్రమ దోపిడీ చేసేవారు లేరని అందరూ సమానమేనని అన్నారు.కానీ వారి విజ్ఞానము ఉత్పాదక శక్తి చాలా పరిమితం అని వారి శ్రమ ఫలితం వారి మనుగడకే సరిపోయేది కాదని,మనుగడ కొరకు పకృతి శక్తులతో నిరంతరము జరిగిన పోరాటంలో మానవుని విజ్ఞానము ఉత్పాదక శక్తి పెరిగాయ ని అన్నారు.ఉత్పాతక శక్తులు పెరిగిన క్రమంలో మొదట స్త్రీ,పురుషుల మధ్య క్రమంగా పశుపాలన, చేతివృత్తులు,వ్యవసాయం



అభివృద్ధి అయ్యి,శ్రమ విభజన జరిగిందని వివరించారు. ఆ వృత్తులు క్రమముగా వంశపారం పర్యమయ్యాయని అవ్వే కుల వ్యవస్థగా వ్యవస్థీకృతమయ్యాయని దేశంలో వృత్తుల ప్రాతిపదికగా కుల వ్యవస్థకు దైవత్వం ఆపాదించి హిందూమతంలో అంతర్భాగం చేయడం జరిగిందని తెలిపారు.ఈ విధంగా ఏ దేశంలో ఏ మతంలో జరగలేదని తెలిపారు.దేశంలో వర్ణ,కుల వ్యవస్థలు ఏర్పడి కట్టుదిట్టం చేయబడినప్పటి నుండి దేశంలోనే వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో ఉద్యమాలు సాగాయని వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా మొదట తిరుగుబాటు జెండా ఎగరవేసిన వారు లోకాయతులు వీరినే తర్వాత కాలంలో చార్వాకుల అన్నారని వర్ణ వ్యవస్థను,కుల వ్యవస్థను నిరసిస్తూ సాంఘిక సమానత్వాన్ని బోధిస్తూ బ్రహ్మనత్వానికి వ్యతిరేకంగా వచ్చిన సాంఘిక సంస్కరణ ఉద్యమాలే బౌద్ధ,జైన మతాలనీ పేర్కొన్నారు.ఈ రెండు మతాలు కుల విభేదాలు,ద్వేషాలు తగ్గుటకు తోడ్పడ్డాయి కానీ, కులాల నిర్మూలన జరగలేదని మధ్య యుగాలలో కుల వ్యతిరేక ఉద్యమం,భక్తి ఉద్యమం రూపంలో జరిగిందని దేవుని ముందు అందరూ సమానమేనని, దేవుని ప్రార్థించుటకు ఆంక్షలు, నిషేధాలు ఉండకూడదని ప్రచారం చేశారని అన్ని కులాలు సమానమేనని ప్రచారం చేశారని మహారాష్ట్రలో కుల వ్యతిరేక ఉద్యమం పుట్టుక జ్యోతి బాపూలేతో ముడిపడి ఉందని అన్నారు.కుల వ్యవస్థకు తాత్విక పునాదిగా ఉన్న బ్రహ్మనత్వ భావజాలానికి వ్యతిరేకంగా ఆయన తీవ్రమైన పోరాటం చేశారని కులాల నిర్మూలన సాంఘిక సమానత్వం సాధించుటకు లక్ష్యంగా 1872 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజ్ స్థాపించాడు. జ్యోతిబా పూలే ఒక గొప్ప సాంఘిక సంస్కర్త ప్రజాస్వామిక వాది ఆయన,ఆయన సతీమణి సావిత్రిబాయి బడుగులకు చదువు నేర్పుటకు ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారన్నారు.వారు స్థాపించిన సత్యశోధక్ సమాజ్ లక్ష్యసాధనకై ప్రజలంతా ఐక్యమై పోరాడాలని వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు కే.గంగాధర్, బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్,పార్టీ మండల కమిటీ నాయకులు బి.నాగమణి,ఇర్షద్,బోధన్ మండల మాజీ ఎంఈఓ కాందారే శంకర్, అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్,అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పార్వతీ రాజేశ్వర్,అరుణోదయ కళాకారుడు చరణ్,భవన నిర్మాణ కార్మికసంఘ నేతలు జయరాజు, ఇస్మాయిల్, సలీం కార్మికులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డీఈఓ దిష్టిబొమ్మ దహనం చేసిన ఏబీవీపీ నాయకులు



**ప్రజాజ్యోతి, నిజామాబాద్ ప్రతినిధి :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చౌక్ లో డిఈఓ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ క్లైరి శశిధర్ మాట్లాడుతూప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్ట రాజ్యాంగ నడుపుతున్న శ్రీ చైతన్య పాఠశాల యొక్క గుర్తింపుని రద్దు చేయాలని, ఇందూర్ జిల్లాలో శ్రీనగర్ కాలనీలో శ్రీ చైతన్య పాఠశాలకి ఎలాంటి పర్మిషన్ లేనప్పటికీ ఉదయం7:30 నుండి రాత్రి 8:30 వరకు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇష్ట రాజ్యాంగ నడిపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ప్రిన్సిపాల్ అదే పాఠశాలలోని పడుకుంటున్నాడు అలాగే 7వ తరగతి వరకే పర్మిషన్ ఉంది 8,9,10 పర్మిషన్ లేకున్నా ఇష్టరాజ్యంగా నడుపుతున్నారు వెంటనే శ్రీ చైతన్య స్కూల్ యజమాన్యంపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఈ విషయంపై డీఈఓకి పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. శ్రీ చైతన్య పాఠశాలపై విచారణ జరిపి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హేచ్చరించారు. దామ సునీల్, దుర్గా దాస్,రాజకుమార్, అలంకార్, రాజేష్, శశాంక్, శివ, సాయి, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప తెలంగాణవాది బాపూజీ - అర్బన్ ఎమ్మెల్యే

**ప్రజాజ్యోతి, నిజామాబాద్ సిటి**



తెలంగాణ ఉద్యమనికి ఊపిరిపోసిన గొప్ప తెలంగాణవాది ఏవరైన ఉన్నారంటే అది కొండా లక్ష్మణ్ బాపూజీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వినాయక్ నగర్ విగ్రహాల పార్కులో బీజేపి ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ భారతమాత బానిస సంకెళ్లు తెంచడానికి స్వతంత్రోద్యమ సమయంలో క్విట్ ఇండియా, వందేమాతరం ఉద్యమలలో కీలకంగా పని చేసారని అన్నారు. స్వాతంత్రం అనంతరం హైదరాబాద్ సంస్థానంగా తెలంగాణ బిడ్డలపై జరుగుతున్నా అఘాత్యాలకి, అకృత్యాలకి నిరసనగా నిజాం రాజుకి ఎదురు తిరిగి తెలంగాణ రైతంగా పోరాటంలో నిజాం అక్రమంగా నిర్భందించిన నాయకులకు అండగా నిలిచిన మహనీయులు బాపూజీ అని అన్నారు. బాపూజీ ఎమ్మెల్యే, ఎంపీ గా సేవాలాందించి సహకార సంఘాల రూపాకల్పనకు నాంది పలికి చేనేత, కుల వృత్తులను సహకార రంగంలోకి తెచ్చి వాటిని అభివృద్ధి చేసిన ఘనత బాపూజీది అని అన్నారు. దేశంలో సైకిల్, పాదయాత్రలకు శ్రీకారం చుట్టిన మహనీయులు బాపూజీ అని, మూసి వరదల సమయంలో 220 మైల్లు పాదయాత్ర చేసి పునరావాస కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని, అది ఆయన సేవకు నిదర్శనం అన్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమనికి ఊపిరి పోసిన మహనీయులు ప్రతేక తెలంగాణ కోసం తన మంత్రి పదవిని గడ్డి పోచల భావించి రాజీనామా చేసిన వ్యక్తి బాపూజీ అని అన్నారు. తెలంగాణ వస్తే మన బతుకులు బాగుపడతాయని, 96 ఏళ్ల వయసులో కూడా ఎముకలు కొరికే చలిలో ఢిల్లీలో జంతర్ మంతర్ లో దీక్ష చేసిన గొప్ప తెలంగాణ వాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమ పోరాటస్ఫూర్తిని గుర్తించి అతని పేరు మీద పోస్టల్ స్టాంప్ ను విడుదల చేయడం తెలంగాణ బిడ్డలందరం గర్వించదగ్గ విషయమన్నారు. నేటి యువతరం లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని వారి ఆకాంక్షలను నెరవేర్చే విధంగా బంగారు తెలంగాణ కళ సాకారం కోసం పని చేయాలన్నారు. అంతకు ముందు బాపూజీ విగ్రహానికి పద్మశాలిలతో కలసి పూలమలలు వేసి ఘనంగా నివాలర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు , పద్మశాలి సంఘం పెద్ద మనుషులు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ రూరల్ సీఐను సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**బోధన్ రూరల్, ప్రజాజ్యోతి, సెప్టెంబర్ 28 :** బోధన్ రూరల్ ఠాణ సిఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్‌ను శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. ఇక్కడే విధులు నిర్వహించిన కోల నరేష్ హైడ్రా కు బదిలీ కాగ అయన స్థానంలో నిజామాబాద్ పట్టణంలో విధులు నిర్వహించిన విజయ్ కుమార్ బోధన్ రూరల్ నూతన సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అయనను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య,బండారి పోశెట్టీ, గంధమాల చంద్రయ్య,పట్టణ అధ్యక్షులు తాడెం అబ్బయ్య,కార్యదర్శి బొడ్డు రవి,ఎంఎస్పి నియోజకవర్గ నాయకులు జాదవ్ ఫకీర్ నాయక్,ప్రవీణ్ , తదితరులు ఉన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు సన్మానం



**బోధన్ రూరల్,ప్రజా జ్యోతి,సెప్టెంబర్ 28 :** సాలుర మండలానికి నూతనంగా వచ్చిన తహసిల్దార్ శశిభూషణ్ కు ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగురావు,ఉపాధ్యక్షులు సాయిలు,చందు,గొనేవర్ నరేష్,వాగ్మారే విశాల్ తదితరులు పాల్గోన్నారు.

# విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన

**బోధన్ రూరల్, ప్రజా జ్యోతి,సెప్టెంబర్ 28 :** బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టణ సీఐ వెంకట్ నారాయణ పోలీసు కళాజాత బృందంచే విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గంలో నడవకుండా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉన్నత చదువులు చదవాలన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కల్పించారు.

